కథ

# ప్రత్యామ్నాయం



ఏ గూటి పక్షులు ఆ గూటికి చేరుకుంటున్నాయి. ఊరంతా చీకటి దుప్పటి కప్పుకుంది. చిత్తడి, చిత్తడిగా ముసురు ... వైరస్ ఫీవర్‌లా రెండు రోజుల నుంచీ ఊరిని పట్టుకుంది. వీచిన హోరుగాలికి, విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపోయి, విద్యుత్ ఆగిపోయింది. విద్యుత్ స్తంభాలకు - వెలగని బల్బులు కొమ్మలకు వేలాడే గబ్బిలాల్లా వున్నాయి. ఊరిబయటి తోటలోంచి - చింతగిరొకటి....అదే పనిగా పంచాయితీ వారి రేడియోలా గీపెడుతోంది.

నాయుడు వీధి- వంట పంచలలోంచి పొయ్యిల్లో చిదుగులు చిటచిటా, పటపటా, చిటాపటా... మండుతున్నాయి. నాయుడు వీధి సాలల వాసలో వున్న చంద్రమ్మ - పొయ్యికిందకీ, పొయ్యిమీదకీ యేమీలేక, నులక మంచమెక్కేసింది. కిరసనాయిలు అయిపోయి, దీపం ఆరిపోయింది. కడుపులో ఆకలి రాగాలు పలుకుతున్నాయి ప్రేగులు! దానికి తోడుగా పొద్దుటి నుంచీ... చంద్రమ్మకు నోరు చేదుగా వుండేది, సాయంత్రానికి జ్వరం తగిలింది. జ్వరానికి, ఉపవాసం మంచి దంటారు- లంఖణం పరమౌషధం - అని! నులకమంచం మీద మూలిగే ఓపిక గూడా లేక ... పడుకుంది చంద్రమ్మ.

“... చెంద్రప్పా ! అగ్గేసావా?” పొరుగు పాకలోంచి కేకేసింది అయ్యవారమ్మ! చంద్రమ్మ నుంచి జవాబు లేదు. అయ్యవారమ్మ రెండడుగులు చంద్రమ్మ పాకవైపు నడిచి, తడిక మీద నుంచి చూస్తూ-

“చెంద్రప్పా” అని మళ్లీ పిల్చి చూసింది

చంద్రమ్మ పడుకోవటం కన్పించి, గబగబా వచ్చింది అయ్యవారమ్మ. కప్పుకున్న కోక గుడ్డ చాలక - గజ,గజా వొణుకుతోంది చంద్రమ్మ. అయ్యవారమ్మ చంద్రమ్మ నుదుటి మీద చేయివేసి-

“ఊస్టమొచ్చినట్టు గుంది. చీకటింటిల తుంగొన్నావేమీ? దీవం బుడ్డీ యేదీ? ఎక్కడుంది...?” అనడిగింది చంద్రమ్మను.

చంద్రమ్మ బాధగా వొత్తిగిలి-


“కిరసనూని అయిపోయి ఆరిపోనాది బుడ్డీ. మరిపుడేల బుడ్డీ? తుంగోడమే గదా?’ ’ అని నీర్సంగా జవాబిచ్చింది.

“వొంటసెయ్యవేటి?ఏటీ తిన్లేదుగావాల? కొంచిం కషాయింజేసి తెచ్చేదేటయితే?” అనడిగింది అయ్యవారమ్మ.

చంద్రమ్మ ఒద్దనలేదు. అయ్యవారమ్మ - కషాయం జేయడానికి తన యింటికి వెళ్లింది. చంద్రమ్మ - కప్పుకున్న కోకగుడ్డ - కాళ్లతో సర్దుకోసాగింది. ముసురు..జ్వరం పెరిగినట్లు పెరుగుతోంది. ఆ చలిలో, ఆ చీకటి రాత్రి, ఆ జ్వరతీవ్రతలో...యే స్మృతులు స్మరణ కొచ్చేయో- సన్నగా యేడ్వ సాగింది చంద్రమ్మ. బందిలదొడ్డిలో ముసిలి ఆవు ఆర్తనాదంలా విన్పిస్తోంది.

కషాయం తపేలానే పొయ్యిమీదపెట్టి, యేడుపు విన్పించటంతో ఓచేత్తో బుడ్డీ పట్టుకుని చంద్రమ్మ దగ్గరకొచ్చింది అయ్యవారమ్మ. బుడ్డీని ద్వారబంధం మీద పెట్టింది. వెల్తురు మంచం మీదుగా తడకల వరకూ ప్రాకింది. పెద్ద పెద్ద కన్నాలుతో యినుప జల్లెడలా నులకమంచమూ; జల్లెడలో గుడ్డ కప్పిన అస్థిపంజరంలా చంద్రమ్మ...నీడలు తడకమీద పడ్డాయి. నీడకి యెదురుగా అయ్యవారమ్మ!

“...ఊస్టంతోటి యేడగూడదు. మరిం తెక్కువైపోద్ది. ఎంతాని యేడుస్తావు? ఏడిస్తే - వొచ్చిన కష్టబాధలు పోతాయేటి? ఓర్చుకోడివేం! పల్లకో ఏడకేడకు....” అని



- ఎ. అప్పల్నాయుడు.

ఓదార్చసాగింది అయ్యవారమ్మ.

చంద్రమ్మ కాళ్లు కూడదీసి, లేచికూర్చొని, ముక్కు యెంగచీది, కాండ్రించి ఉమ్మింది...ముంజూరు అవతలకి. మళ్లీ కాళ్లు చాపి, చేరబడి-

“....కాటికి కాళ్లు సాపే కాలానికీ కష్టాలు తీరలేదు. ఎంతమరి రాయించుకొచ్చేనో- ఆ బ్రెమ్మదేవుడి కాడ! కనీ, పెంచిన కొడుక్కి బరువయి పోనాను. ముచ్చు (మృత్యు) దేవత అతగాని కంటా, నా కొచ్చింది కాదు. నన్ను వొదిలీసి, యెలిపోనాడు మాన (మహను) భావుడు! నీ నెపుడు పోతానా అని సూస్తండు కొడుకు..” అని వాపోయింది చంద్రమ్మ.

అయ్యవారమ్మ మౌనంగా వింటూ, యెదురింటివైపు చూసింది. ఎదురింటిలో దీపపు వెలుతురు...తలుపు సందులోంచి కన్పిస్తోంది. ఆ యింట్లోంచి పిల్లల గోల...చిన్నగా విన్పిస్తోంది.

ప్రతి యింటికీ - వీధి తోవకు కొంతజాగా పోగా, యెదురుగా పశువుల సాల వుంటుంది. పెద్ద రైతులు కుదేలయిపోతే - పశువులు చెల్లిపోతాయి. సమిష్టి కుటుంబాలు వేరుపడితే...పశువుల సాలలు ఇళ్లగా మారుతాయి!

అలా మారిన పశులసాల-యింటిలోనే చంద్రమ్మ వుంటోంది. ఎదురింటిలో కొడుకు సంసారం.

ఎదురింటి వీధి తలుపు తెరుచుకుంది. వెల్తురుతో పాటూ యెనిమిదేళ్ల రోజా- అన్నం పల్లెం ఒక చేతా, హోంవర్క్ నోట్‌బుక్ మరోచేతా పట్టుకొని తల్లి వెనకాలే వచ్చింది. వాళ్ల అమ్మ వీధివైపు చూస్తోంది. రోజా అన్నం పెట్టమని అమ్మను వేధిస్తోంది. ఈలోగా , యింట్లోంచి చిన్న కుర్రాడు శంకర్ వొచ్చి; ‘అమ్మా, ఆకలే’ అని అరుస్తూ, తల్లి కాళ్లను చుట్టుకొని గుంజుతున్నాడు.

బియ్యం తెస్తానని వీధిలోకి వెళ్ళిన భర్త యెంతకీ రాడు. పొయ్యిమీద యెసర కెరలి పోయి మరుగుతోంది.

“....ఈధిలోకెల్తే యిల్లు మర్చిపోతాడు! ఏ పెద్ద గుర్రం పళ్లు దోముతాడో...ముండ్రాల పెద్దమనిసి.” అంటూ, భర్తను దూషిస్తూ, ఆతని రాకకోసం చూస్తోంది. కాళ్లను చుట్టిన కుర్రాడు -రాగం స్థాయి పెంచాడు. అసలే చిరాగ్గా వున్న ఆమె - పిల్లలిద్దరి వీపుల మీదా దబ,దబా దరువులు వేసేసి-

“..ఆకలేస్తే నన్ను తినేయర్రా! ముండ మంద పుట్టీసినారు..యెపుడూ ఆకలిగోసే. వొండినదాకా వుండలేనోళ్లు...పండినదాకా వుంటారా? పడలేక పోతన్నాను మీతోటి..” అని కేకలు వేసింది.

..ఆ దరువులకూ, ఆ కేకలకూ. ఆ యిద్దరు పిల్లలూ యేడుపు యెంగబెట్టుకొని - కిక్కురుమనకుండా.. యింట్లోకి పారిపోయేరు. ఆమె, వీధి తలుపు మూసేసుకొని, యింట్లోకి వెళిపోయింది.

అయ్యవారమ్మ- యెదుటి దృశ్యమంతా చూసి, దీర్ఘంగా నిట్టూర్చి-

“...కషాయిం మరిగిపోయుంటాది. వొట్టుకొస్తానుండు...” అని చెప్పి, లేచింది.

అయ్యవారమ్మకు అంతా అయోమయంగా వుంది.,

ఎలాంటి చంద్రమ్మ..!?

★ ★ ★ ★ ★

పాతికేళ్ళ కిందట!

నీలకంఠేశ్వర స్వామి ఆలయ పూజారిగా పిలిపించింది బరంపురంలో వుంటున్న బసవలింగం గార్ని. పూజారిగా వచ్చేడు బసవలింగం - భార్య శాంతమ్మతో! ఈ ఊరొచ్చిన నాటి నుండే - బసవలింగం, శాంతమ్మల పేర్లను ఊరి ప్రజలు - అయ్యావారూ, అయ్యావారమ్మ- అని స్థిరపర్చేరు.

బరంపురం నుండి, కొద్దిపాటి సామాన్లతో, ఊరు చేరిన రోజే; తన పెంకుటింటిలో ఒక గదిలో తమని కూర్చోబెట్టి; పెద్దపళ్లెంలో బియ్యం, మిరపకాయలూ, చింతపండూ, ఉప్పు, పెసరపప్పు, బంగాళాదుంపలూ- భత్యం తీసుకొచ్చి-

"అయ్యావారమ్మా ! ఈ పూటకి, మా పొయ్యిమీదనే భత్యం వొండుకోండి. సాయింత్రానికి - మీకు యిల్లు అప్పజెప్తాము..' ' అంటూ ఆదరించింది చంద్రమ్మ.

చంద్రమ్మ...తన యీడుదే. కాకపోతే కాస్త పొడగరి. సన్నంగా బొప్పాయి మొక్కలా వుంటుంది. కాళ్లకి కడియాలు, మెడకి నానూ, పట్టెడ; చెవులకి యెత్తు గొలుసులూ - నిండుగా పూచిన సన్నజాజిలా అలంకరణల్తో కన్పించింది చంద్రమ్మ. ఆ సాయంత్రానికి అన్నట్లుగానే యిల్లు అప్పగించింది.


నాగావళి నది ఒడ్డున నీలకంఠేశ్వరాలయం. ఆలయంకి ముందు కొద్ది దూరంలో మామిడి తోట. ఈ తోటకి దోవ తీస్తుంది నాయుడు వీధి. చంద్రమ్మ గారి పెంకుటిల్లుకి, యెదురు వాసలో రెండుగదుల పూరిల్లు అప్పజెప్పింది.

"...యెలగుంది అయ్యావోరమ్మా యిల్లు?' 'అనడిగింది చంద్రమ్మ. తనే యేమీ చెప్పలేదు జవాబు. తదేకంగా చంద్రమ్మనే చూస్తూ వుండిపోయింది.

"...దిస్టి తగుల్తాదయ్యావోరమ్మా ! ఏటలగసూస్తావునన్ను? రైతువోరి ఆడోళ్లం, యీ సరుకూ, సప్పరా వుంటేనామా అందం! నీలాగ..మల్లిపువ్వు అందం మా కుండదు...' అంటూ కపటంలేకుండ గలగలా మాట్లాడింది చంద్రమ్మ. ఆ రోజే, మనసారా "అప్పా" అని చంద్రమ్మను పిల్చి, కౌగిలించుకుంది తను! ఆ నాటి నుంచీ, అప్పా చెల్లెల్లులా బ్రతికేరిద్దరూ!

★★★

పొయ్యిమీద నుంచి కషాయం దించి,




గ్లాసులో కొద్దిగా పంచదారవేసి తొరిపింది. చెంబులో కషాయంతో, గ్లాసు మూతపెట్టి తీసుకొచ్చి ;చంద్రమ్మను లేపింది అయ్యావారమ్మ. గ్లాసులో కషాయం పోసి, అందిస్తూ-

"యిదా, కొంచెం తాగి, యిముడ్చుకో. ఊస్టంతగ్గుతాది." అంది.

"కసాయింకి బదులు యింత యిసం కలిపేసిచ్చిద్దూ. తాగేసి సత్తాను" గ్లాసు అందుకుంటూ పలికింది చంద్రమ్మ బాధగా.

"....యేంవీ? నేనిలగ బతకటం నీకిస్టంలేదా? మిలట్రీ భోజనం (జైలులో భోజనానికి - పల్లెటూరి వారిపేరు) పెట్టిస్తవేటి నాకు? నీ కొడుక్కో, కోడలుకో సెప్తే - ఆపనేదో సంతోషంగా చేస్తారు నన్ను బతిమాలడమేల?' ' అని హాస్యధోరణిలో జవాబు చెప్పింది అయ్యావోరమ్మ.

చంద్రమ్మ రెండు గుక్కలు కషాయం మింగింది. గొంతు మిరియాల కారానికి మండింది. పెదవులు చప్పరిస్తూ..యిస్ కొట్టింది. నోటిలో లాలాజలం ఊరింది. గింజుకుని మింగింది.

"...పోషించే పెనిమిటి పోయేడు. గెంజిపోయాల్సిన కొడుకు తప్పుకుతిరుగుతండు. ఈ , యింత నువ్వేనా అదుకోపోతే - నా గతి యేటి?" అనడిగింది చంద్రమ్మ.

"...అందరికీ ఈ దేవుడే గతి!" రెండు చేతులు జోడించి, మీదకి మొక్కుతూ చెప్పింది అయ్యావారమ్మ.

"పెసిరెంటు కొలు యిచ్చేదా? సాయం పాకం (స్వయం పాకం)కేనా భత్యమిస్తండా?' 'అనడిగింది చంద్రమ్మ, దేవాలయ భోగట్టా!

అయ్యావారమ్మ ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేదు. మౌనంగా, చంద్రమ్మనే చూస్తూ వుండిపోయింది.

★★★

పెరట్లో పండిన కూరగాయ, పొలంలో పంట...యేది అయినా చంద్రమ్మ ముందుగా అయ్యవారమ్మ కిచ్చి; తర్వాతే తన యింటికి చేర్చేది. ఏ జన్మలోనో నిజంగా తోబుట్టువులే మీరు; యీ జన్మలో యిలా కలిసేరు అనేవాడు అయ్యావారు.

చంద్రమ్మది లంకంత కొంప. సాలనిండా పశుసంపద. నీలకంఠేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమి అయిదెకరాలు గాక; మరో అయిదెకరాల పల్లపుభూమికీ, చంద్రమ్మ కన్నవారు పసుపు కుంకుమల కింద యెకరా భూమి కలిపేరు. చంద్రమ్మ భర్త గుంపస్వామి నాయుడుకి...పొలంపనీ; కళ్లంలో రైతుల్తో కబుర్లూ తప్ప; మరేవీ పట్టవు. చంద్రమ్మదే యింటి బరువూ, బాధ్యత.

భోగభాగ్యాలు అనుభవించింది. ఇంటి పరువూ ప్రతిష్ఠా పెంచింది. ఆడపడుచులు ముగ్గురికీ, స్థాయికి తగ్గ సంబంధాలు చేసింది. సారెచీరలు పెట్టింది. ఎక్కడనుంచి తెచ్చి, యీ పెళ్లి పేరంటాలు చేసిందో - యెన్నడూ ఆలోచించేవాడు గాదు భర్త! ఎక్కడో మంచి ఆవు వుందంటే, బేరం జేస్సి తోలుకొచ్చేవాడు...దానికి డబ్బు వ్యాపగించి యిచ్చేది చంద్రమ్మ. కురుపాం జమీందార్ల దగ్గర మైసూరు ఎద్దులున్నాయి, అమ్మేస్తారంటే..పరుగెత్తికెళ్లి...కొనుక్కొచ్చేడు భర్త .....ఓ సారి! వాటికి డబ్బు కోసం చంద్రమ్మ మెడలో పట్టెడ, నానూ అమ్మేసింది.

'సంగం' యాత్రకు ఆ ఎడ్లబండిలో వెళ్లినపుడు-

"...బావని గడమాయించకపోయేవా అన్నావు ! బంగారమేల అమ్మేవన్నావు! బావ యేటి జేసినా - కాదన్లేను. అయిన్నా,బంగారం లాంటి యీ యెద్దు మనకెలాగొస్తాయి..." అంది చంద్రమ్మ, అయ్యావారమ్మతో! ఆ యేడాది శివరాత్రికి ఆ యెడ్ల బండి మీదనే, సంగం, తోటపల్లి, గుంపయాత్రలకు వెళ్లేరు.

అప్పటికే నలుగురు బిడ్డల తల్లి అయింది చంద్రమ్మ. ముగ్గురు ఆడపిల్లల తర్వాత కొడుకుపుట్టాడు. అత్తగారి వంశవారసత్వమట! నాలుగో సంతానం కొడుకు పుడతాడేట! చంద్రమ్మకి - కొడుకు పుట్టేక ఒకటొకటిగా




ఆపదలు రాసాగేయి. నీలకంఠేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేయించింది. ఆపదల నుంచి గట్టెక్కాలని.

ఏటకేటా, వర్షాలు తగ్గిపోయి - పంటలు పోయేయి మూడేళ్లు. మదుపులు మాత్రం తప్పేవిగాదు. అప్పుల్తో గట్టెక్కాల్సివొచ్చేది మూడేళ్లూ. పంటల్లో మార్పులొచ్చేయి. వరిపంట తగ్గించి, వాణిజ్య పంటల్లోకి దిగేరంతా. జనుము, వేరుశనగ, పొగాకు పండించేరు. పండిన పంటకి ధర తగ్గిపోయేది. పండించని పంటకు ధర యెక్కువ వుండేది. ధర ఎక్కువుంది గదా అని - ఆ పంట యేస్తే - ఆ యేడు ఆ పంటకి ధరపడిపోయేది. చంద్రమ్మ ఒంటిమీది బంగారం - తనఖాకి, తర్వాత అమ్మకంకీ వెళిపోయింది. సొమ్ములు తీసేసిన అమ్మవారి విగ్రహంలా - బోసిగా కన్పించేది చంద్రమ్మ.

ఇంతలో భూములు రీ సర్వే చేసారు. ఎందుకు చేసారో, యెవరికి లాభించిందో తెలీదుగానీ, - ఆలయం మాన్యం భూమి దేవాదాయశాఖవారు అజమాయిషీలోకి తీసుకొని - కౌలు మార్చేసారు. ఊరి కౌలురైతుల్తో పాటూ, చంద్రమ్మ కౌలుకు చేస్తోన్న అయిదెకరాల భూమీ తీసుకొని - ఊరి సర్పంచ్‌కి కౌలుకిచ్చేసారు.

***

"...నీ సౌభాగ్యం తరిగినట్టే - నీలకంఠేశ్వరస్వామి సౌభాగ్యము తరిగిపోయింది. అపుడు, ఆలయ భూములు మీ చేతిలుండేవి. ఆటిమీద పంటలు పండించి మీరూ బతికే వోలు; దేవుడికౌలు దేవుడికీ యిచ్చేవోరు. అపుడెలా గుండీది కోవెల? కళకళలాడేది. అగరొత్తులు వాసన గర్భగుడి నుండి- మండపం దాకా యేసేది. కోవెల చుట్టూ గన్నేరు, నందివర్ధనం, మందారం...పూల మొక్కలుండేవి. తులసి వొనమే వనం! ఇప్పుడో!? ప్రహరీ కూలిపోయింది. గర్భగుడి గచ్చుపెచ్చులూడిపోయింది. సున్నం మొకం జూసి యెన్నాళ్లయ్యిందో కోవెల! " చంద్రమ్మ ప్రశ్నకు- కోవెల పరిస్థితి చెప్పుకొచ్చింది అయ్యవారమ్మ.

"....దేవుడి పోషణకేనా యివ్వకండా అంతా నొల్లిడానికి ఆపెసిరెంటుకి యెలగ మనసొప్పుతంది? దేవుడి మీద భక్తీ, భయిమూ..రాన్రానూ తగ్గిపోతంది గదా అయ్యవోరమ్మా ప్రెజలకి?" అనడిగింది చంద్రమ్మ కషాయం మరో గుక్క మింగి!

"...భయిం, భక్తీ తగ్గిందనీ అన్లేము. అన్నిటికీ మార్పులొచ్చినట్టగే దేవుడికీ వొచ్చింది. అయ్యప్పస్వామిబృందం, శాయిభక్త సమితి, బాబాభజన సంగం..వీధి కొకటి లేవేటి?ప్రశ్నిస్తూ జవాబిచ్చింది. అయ్యవారమ్మ.

"...ఈభక్తులికికోవిల సంగతక్కర్లేదన్నిమాట?" చంద్రమ్మ.

"...దేవుడి కింత ప్రసాదంకి దిక్కులేదు, అంత ఆలయభూమి వుండికూడా! కొడుకు మురళీ టైలరింగ్ నేర్చుకోబట్టి పనికొచ్చింది. మాకు యింత ముద్ద కూడూ, దేవుడికింత ప్రసాదమూ సంపాదించుతండు" అని చెప్పింది అయ్యవారమ్మ.

చంద్రమ్మ కషాయిం అంతా తాగేసింది. గ్లాసుఅయ్యవారమ్మకు యిచ్చింది. ఎదురింటి వీధి తలుపు తెరుచుకుంది. దీపం పట్టుకొచ్చి, గడపమూలన పెట్టి, దాని యెదురుగా కూర్చొని- రోజా పుస్తకం తీసి చదవసాగింది.

చదువుతోన్న రోజాను చూసి, అయ్యవారమ్మ రమ్మని కేకేసింది. రోజా - చదువుతున్న పేజీలో గుర్తుగా పెన్సిలు పెట్టి, పుస్తకం మూసేసి, వొచ్చింది. మంచమ్మీద నాన్నమ్మ గుడ్డకప్పుకు, వొణుకుతుండటం చూసి-

"..నాన్నమ్మా, జ్వరమా?" అనడిగింది, దగ్గరగా వచ్చి రోజా.ఆ మాత్రం ఆప్యాయతకే చంద్రమ్మలో - కడుపులోంచి దుఃఖం కదిలింది. కంటనీరు దించింది మౌనంగా!

అయ్యవారమ్మ రోజాను-

"రోజా, మీ నాన్న లేడేటమ్మా?" అనడిగింది.

"బియ్యం కోసం వెళ్ళాడట. ఒక క్షణం కిందట, మంగలి కన్నయ్య చేత బియ్యం పంపించేసి, ఎలక్షన్ గదా యెవరో మీటింగ్ పెట్టారట...అక్కడుండి పోయాడట. మా అమ్మ దుఃఖపడతంది." రోజా బదులు చెప్పింది.

"ఎన్నో క్లాసు సదువుతన్నావమ్మా?" చంద్రమ్మ అడిగింది.

"సిక్స్త్ క్లాస్ పాసయి, సెవెంత్ కొచ్చేను.."

"అంతే - యెన్ని?"

"యేడు!" చెప్పింది రోజా.

ఇంతలో రోజా తమ్ముడు-

"ఒలక్కా, అక్కా..!" అంటూ పిలుపు కొచ్చేడు.

అయ్యవారమ్మ, శంకరిని దగ్గరకు తీసుకొని-

"శంకరీ! మీ నానమ్మకి జొరంరా! మందులుతేగూడదూ?" అంది.

"...జొలంకి యింజీసన్ చేస్తే జొలం సచ్చిపొద్ది. నేను పెద్దయితే డాక్టలయి - నానమ్మకి యింజీసన్ చేస్తాను. మలెప్పుడు జొలం లాదు..." అని చేతులూపుకుంటూ చెప్పాడు వాడు.

వాడిమాట తీరుకు చంద్రమ్మ ఆనందంతో పొంగిపోతూ--

"...నా నాయిన! ఎంత అప్మానం (అభిమానం) రా-నీకు నా మీద! నువ్వు పెద్దోడివయి డాకటేరయి, యిండీసన్ చేసేదాకా బతుకుతాన్రా మనవడా తప్పకండా బతుకుతాను..." అంది.

"..డాక్టరు బాబూ, మరి నాకు మందు లివ్వవా? మీనాయనమ్మకేనాయిస్తావు? అని హాస్యమాడింది అయ్య వోరమ్మ.

"ఓ! ఎందుకివ్వనూ? నీకూ జొలమొస్తే - నా దగ్గిలికే ....లా! తప్పకుండా యింజిషనిస్తాను...." అని హామీ యిచ్చేడు శంకరి.

పెద్దచదువులు చదివించి, ప్రయోజకుణ్ణి చేయాలనుకున్నారు.. తమ కొడుకుని - చంద్రమ్మా, భర్త గుంపస్వామినాయుడూ! ఒక్కగానొక్క కొడుకుగదా, ఆడబిడ్డల్తో.. అందుకని, పొలం పనిలో చేర్చకుండా, పాఠశాలలో చేర్చారు కొడుకుని.

కొడుకు సూర్యనారాయణ -కోటిపాం హైస్కూల్ చదువయిపోయింది. కాలేజీ చదువుకి విజయనగరం పంపించేరు. ఆ యేడాదే, పెద్దకూతురి పెళ్లి చేసింది చంద్రమ్మ. ఇటు కొడుకు కాలేజీ చదువుకీ, అటు కూతురు పెళ్ళికీ మిగిలిన అయిదెకరాలలో రెండెకరాలు

అమ్మక తప్పింది కాదు చంద్రమ్మకు.

సరిగ్గా, ఆరోజుల్లోనే 'అర్తాం'లో సుగర్ ఫ్యేక్టరీ పెట్టారు. రైతులు చెరుకు పంటకి దిగేరు. చెరుకు గడ తీపికి అలవాటు పడి, ఎలుగుబంట్లు పొలాలకు దిగేవి. ఓ సాయంత్రం వేళ...పొలంలో చెరుకు మడి యీ కొసనించి చూసుకుంటూ వస్తోన్న గుంపస్వామినాయుడు మీద - ఓ పిల్లల ఎలుగు దాడి జేసింది. చావుదప్పి, కన్నులొట్టబోయింది నాయుడుకి. అప్పట్నించీ మరి నాయుడు పొలంపనికిపేనికిరాని అవిటి వాడైపోయాడు. కళ్లానికీ, యింటికీ పరిమితమై పోయాడు. అందరూ అతనిని..బంటి గుంప స్వామి అని పిలవ సాగేరు.

చెరుకు పంటకు యెరువూ, మందులూ, మమ్మూ అప్పుకింద అందిచ్చిన కంపెనీ - చెరకుకి కిట్టుబాటు ధర రైతుకివ్వలేదు. మరో యేడాదైతే క్రషింగుకి పర్మిట్లూ యివ్వలేదు.. ఫ్యాక్టరీ కార్మికుల సమ్మెకారణాన ఆగిందనీ! చెరకు పిప్పిలా మిగిలారు రైతులు. ...చంద్రమ్మ...సంసార సాగరంలో...కాళ్ళూ, చేతులూ అందని లోతుల్లోకి దిగిపోయింది.

చదువుకోసం పంపితే - కొడుకు సరదాలు నేర్చుకున్నాడు. సరసాలు సాగించేడు. మెస్‌లో భోజనం జేసే సూర్యనారాయణ ఆ మెస్ యజమాని కూతురు సరోజతో ప్రేమపాఠాలు చదివేడు. డిగ్రీ మధ్యలో ఆపేసి సరోజ మెళ్లో తాళి ముడేసి, యింటికి తీసుకొని వచ్చేడు.

***

సరోజ - గడపలోంచి పిల్లల్ని కేకేసింది... రమ్మని!

"నాన్నమ్మా, వొస్తాను..." అని చెప్పి రోజా యింటికి పరుగెత్తింది. "ఒలక్కా, ఉండే..." అంటూ వెనకాలే పరుగెత్తాడు శంకరి.

చెంబూ, గ్లాసూ తీసుకొని అయ్యవారమ్మ లేచి,-


"...మా బాబు మురళీ గూడ యింకా రాలేదు.. ఈడూ ఆ ఎలక్షన్ మీటింగు కాడే వున్నాడేటో...?" అంది.

"...ఎవులెవులికమ్మా పోటీ?" అనడిగింది చంద్రమ్మ.

"కాంగిరేసోలికీ, తెలుగుదేశమోలికీ,..." చెప్పింది అయ్యవారమ్మ.

"అలక్కాదూ, మనయేరియాల, యెవులి మద్దెన పోటీ?" అనడిగింది చంద్రమ్మ మళ్లీ.

"...ఎవురెవురి మద్దెనో యెందుకుంతాది పోటీ? మనకి లేరా? కురుపాం రాజులూ, ఘేరంగి రాజులూ! ఆ రెండు కోటలు మద్దెనే పోటీ?" అని చెప్పింది అయ్యవారమ్మ.




"అలక్కాదమ్మా. ఇపుడా రెండుకోటల వాళ్లూ సఖ్యమైపోయి ఒకే పార్టీ అయి పోయారు. ఆల్లకీ, మరొకాయన పేదోడ్లే - ఆయనకీ మధ్యపోటీ!" అని ఆ ప్రాంతంలో శాసనసభకు ప్రతినిధులుగా పోటీపడ్తోన్న వారి గురించి చెప్పాడు మురళీ..అపుడే అక్కడికొచ్చి.

"ఆహ! పోన్లే, యెవులి మద్దెన పోటీ అయితె మనకేలగానీ: పద, పదా...యింకా వంటవలేదు. చెంద్రప్పా; అలాగ కళ్లు మూసి పడుకో. మళ్లా పొద్దున్నొస్తాను...." అని చెప్పి అయ్యవారమ్మ లేచింది.

కోక గుడ్డ...కాళ్ళతో సర్దుకు కప్పుకోసాగింది చంద్రమ్మ! గుడ్డను శుభ్రంగా కప్పి; అయ్యవారమ్మ, మురళీని పదమంటూ... కదిలింది ఆమె మనసులో యెన్నో ప్రశ్నలు!

ఎలాంటి చంద్రమ్మ...? ఆఖరికి...!?

నీలకంఠేశ్వర స్వామి ఆలయ సౌభాగ్యం తరిగిపోడానికి తెలిసినంత స్పష్టంగా - కారణాలు చంద్రమ్మ సౌభాగ్యం తరిగిపోవడానికి తెలియటం లేదు ఆమెకు!

***

బారెడు పొద్దు...యెర్రగా ఆకసాన పరుచుకుంది. మూడ్రోజులైంది ముసురు వొదిలేసి. పక్షులు రెక్కల్ని చాచుకుంటూ - ఆహ్లాదంగా ఆకాశంలో యెగురుతున్నాయి. తుమ్మెదలు...నందివర్ధనం పూల మీద వరుసగట్టి వాల్తున్నాయి. తూరీగలు...గన్నేరు పూవుల్తో ఆడుకుంటున్నాయి. నీలకంఠేశ్వర స్వామి ఆలయం ధ్వజస్తంభం మీద కోయిల ధీమాగా కూర్చొని కుహుకుహూ రాగాలు పోతోంది. నాగావళి నది ఒడ్డుమీది రెల్లుపొదలు..చిరుగాలికి పులకరింతల్తో కదులాడు తున్నాయి. నదికి నీళ్లకోసం వెళ్ళే ఆడవాళ్ల చేతిగాజుల గల, గలలు, కాలి అందెల రవళులు స్వరపరికరాలై.. .సంగీత మయంగా విన్పిస్తోన్నవి. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

ఆలయం ముందరి మండపం మీద కూర్చున్న అయ్యవారు...చాలా సేపటినుంచీ మౌనంగా వున్నారు. అయ్యవారికి కొద్దిగా యెడంగా, పోలయ్యమామ, లచ్చయ్యతాత కూర్చున్నారు. అప్పటిదాకా కూర్చుని, అసహనంగా లేచి నిల్చున్నాడు సూర్య నారాయణ. ఈ వాతావరణం అసహనంగా వుంది సూర్యనారాయణకు.

మూడురోజులనుంచీ, యింట్లో అయ్యవారమ్మ రోజూ చెప్తోంది. ఈ వాళ్టికి కుదిరింది అయ్యవారికి! సూర్యనారాయణను పిలిపించేడు.. తోడుగా, యిద్దరు కులపెద్దల్ని కూచోబెట్టుకున్నాడు అయ్యవారు.

సూర్యనారాయణ వచ్చేక- విషయం యెలా యెత్తుకోవాలో అన్నమీమాంసతో మౌనం వహించేడు అయ్యవారు.

పోలయ్యమామ మాత్రం..మూడురోజుల కిందట రాజకీయ నాయకుల మీటింగ్ విషయం యెత్తాడు. పోలయ్య..గతంలో యింటింటా తిరిగి, పిల్లలు కూడబెట్టే జనపనార కొనేవాడు. రాన్రానూ, రైతులకు వందా, వెయ్యి, అప్పులిచ్చి అడ్వాన్సులిచ్చి, రైతులు పండించే జనపనారనూ కొనే స్థాయికి యెదిగాడు. అందరితో హాస్యాలాడుతూ, అన్ని విషయాల్లోకీ దూరుతూ కలుపుగోరుగా తిరిగే పోలయ్యను - అందరూ పోలయ్యమామ అని పిలుస్తుంటారు. పోలయ్య మామ- యే రైతయినా చిదిగిపోయి, పొలం అమ్మకం పెట్టాడా అని యెదురు చూస్తుంటాడు.

లచ్చయ్య తాత మౌనంగా, పొగాకు రెమ్మను సాపుజేసి చుట్టతయారుచేసుకుం టున్నాడు. అసహనంతో; లేచి నిల్చున్న సూర్య నారాయణ-

"పురుమాడ గుడ్డి మీదకెల్లాల. పనున్నాది." అన్నాడు.

"...అయితెలిపోరా! పెద్ద రైతోడివిగదా నువ్వే. ఇవతల మీమెవులిమీ రైతులమే? పనులున్నోలిమే? ఎలిపోరా అయితే!" అని కోపగించాడు లచ్చయ్య తాత

సూర్యనారాయణపై.

లచ్చయ్య ఊరందరికీ తాత! అంత పెద్దవయసాయన! లచ్చయ్యతాతకు -అసలీ తగువంటేనే కోపంగా వుంది. తల్లి,కొడుకులే వేరు కాపురాలు పెట్టుకోడం నచ్చదు. లచ్చయ్య తాత కుటుంబాలు ఉమ్మడిగా వుండాలంటాడు. ఇప్పటికీ- తన యింటిని అలాగే నడుపుకొస్తున్నాడు. కొడుకులు నలుగురికీ పెళ్లిళ్లయ్యేయి. వాళ్ళకు పిల్లలున్నారు. మనవరాళ్లు, మనవళ్లూ- కొడుకుల్తో ఉమ్మడిగా కుటుంబాన్ని నిలుపుకొస్తున్నాడు. ఉమ్మడి కుటుంబాల్లో ఆనందమే గొప్పది. అందరితో పంచుకొనేదీ అంటాడు. ఉమ్మడి కుటుంబం వల్ల - అందరూ తలా ఓ చెయ్యివేస్తే....యెంతపనైనా సులువుగా అయిపోతుందిగదా అంటాడు. లచ్చయ్యతాతంటే ఊరిలో అందరికీ అందుకే గౌరవభావముంది.

లచ్చయ్యతాత ఆమాట అన్న తరువాత సూర్యనారాయణ నిల్చున్న చోటనే అలా వుండిపోయేడు జవాబూ యివ్వలేదు. కదలనూ లేదు.

అప్పటికి, అయ్యవారే మౌనంవీడి-


"...మీ అమ్మకి మూ్డ్రోజులుగా జ్వరం. మందూ,మాకు లేక మంచమ్మీద మూలుగు తోంది." అన్నాడు, తర్వాత సంభాషణకు ఉపోద్ఘాతంగా.

"..మందూ,మాకేటి? ఇన్ని గెంజినీళ్లకి గతిలేకపోయింది. కనీసం దివ్వ యెలిగించ ంకి కిరసనూనైనా లేదట...." అని చెప్పాడు జె లయ్యమామ.

"ఆ సంగతి ఆడికి తెల్దేటి నువ్వు సెప్తున్నావు? ఏటి ఆలమ్మకి దూరాబారా నున్నాడా? కళ్లకెదురుగా వుంది కాదేటి....ముసిల్ది? కనబడదేటి ఆడికి?" అని కసురుకున్నాడు లచ్చయ్యతాత.

అయ్యవారికి- వ్యవహారం సాఫీగా జరిపించాలని వుంది తప్పా; సూర్యనారాయణ ను ముద్దాయిని జేసి - తగువు సాగదీయాలని లేదు. పదేళ్ల వయసులో వుండివుంటాడు, సూర్యనారాయణ - అయ్యవారు యీ ఊరొచ్చి నపుడు. అప్పట్నించి, సూర్యనారాయణను చూస్తున్నాడు. అందరికంటే తనకే సూర్య నారాయణ గురించి బాగా తెలుసు.

సరోజినిని పెళ్లి జేసుకొన్నాక సూర్య నారాయణ ఊర్లోకి వచ్చేక తిన్నగా కోవెలకే వచ్చాడు. వధూవరులిద్దరూ నీలకంఠేశ్వర స్వామికి దండాలు పెట్టి తర్వాత అయ్యవారి కాళ్లకు దండంపెట్టారు. సూర్యనారాయణ-




అయ్యవారిమీదనే తన అమ్మా, నాన్నలు తనపెళ్లిని అంగీకరించేట్లు చేసే బాధ్యతను పెట్టాడు. ఈ బాధ్యతను అయ్యవారు నెరవేర్చాకఅన్ని విషయాలూ సూర్యనారాయణ అయ్యవారితోనే సంప్రదించేవాడు. గడిచిన గతమంతా..అయ్యవారెరగనిది కాదు. గతంలోంచి చూస్తే...వర్తమానం సక్రమంగా అర్థమవుతుంది.

"...నిన్నా, మొన్నా, అయ్యవారమ్మే కషాయిమదీ యిచ్చింది మీ అమ్మకి. ముసిల్దాయి..చచ్చీలాగుందని అయ్యవారమ్మే చెప్పింది....." అని అయ్యవారు చంద్రమ్మ పరిస్థితిని చెప్పాడు సూర్యనారాయణకు. ఆ పరిస్థితిలో వున్న తల్లికోసం- యే త్యాగమన్నా చేయాలన్న బోధన ధ్వనించింది ఆయన మాటలలో! సూర్యనారాయణ అది గ్రహిం చేడో, లేదోగాని; ఆ మాటలకు లచ్చయ్యతాతే స్పందించి-

".....యెపుడు సస్తాదా అని సూస్తన్నాడు గావాల? భేష్, సెభాష్ - నీ లాంటి కొడుకులుంటే - ఆ తల్లిదండ్రులు అదేటండీ అయ్యవోరో? పున్నాగనరకమా? దాన్నిక్కడే సూసీస్తారు." అన్నడు సూర్యనారాయణను నిరశిస్తూ.

సూర్యనారాయణ - యీ మాటకూ జవాబివ్వలేదు. తలదించుకునిల్చున్నాడు. దీర్ఘాలోచనలో - నేలచూపులుచూస్తున్నాడు.

***

సరిగ్గా- అప్పుడూ యిలానే తలదించుకు నిల్చున్నాడు.

"...పెద్దలం అని ఆలోసించేడా? తల్లి దండ్రులుం వున్నామని సూసేడా? మా పెద్దరికం ముక్కలు జేస్సి, మూడుముళ్లేస్సి, ముకం సూపించేడు.

అపుడూ- నువ్వేళొ నచ్చసెప్పావ్. కాలం మారిందన్నావ్. కుర్రోళ్లు పూర్వంలా గుండ రన్నావ్ అయ్యవోరివి, నువ్వు అంతయిదిగా సెప్తే కాదన్లేకపోనాం. కన్నకడుపు గదా- కొడుకు తలమీద అక్షింతలు యెయ్యిలేక పోనామన్న బాధని దిగమింగుకున్నాం. దిష్టి దిగతుడిసి...యింటిల అడుగుపెట్టనిచ్చేం!

ఏటిజేసాడు? ఇంటిలఅడుగుపెట్టినోడు యేటి జెయ్యాల? ఏటి, అంతకమునపు సంసారమా? కూచోని తిండానికి! తండ్రి చూస్తే అవిటోడయిపోనాడు. తల్లి జూస్తే, ఆడముండ, వయసుడిగిందాయీ- యింకా బరువ లెత్తుతాదే- అని ఆలోసించేడా? నా బరువేమేనా అందుకున్నాడా? నువ్వే సూసేవ్....సెప్పు అయ్యవోరూ? ఎపుడెత్తు కోలేదు. పోనక్కర్లేదు. అలగుండమన్నాను ఉన్నాడా? రొండో బిడ్డకి యిటు పెళ్లిజేసాను. తోడబుట్టిన దాని పెళ్లికి అన్నదమ్ముడుగా ...యేటి కస్టపడిపోనాడు? ఆ పెళ్ళికి రెండెకరాలు భూమి తనకాయెడితే ఆ తనకాని క్రెయిం అమ్మకం చేస్సిన దాకా వొప్పేడా? ఇంటిల రణపోరు బెట్టేడు. ఆ భూమి అమ్మేసి, ఆ సొమ్మందుకోని పెళ్లంతోటి పట్నమెలి పోనాడు! అపుడే అనుకున్నాను- యిక మరీ యింటిని యెత్తిదించవొలిసింది కొడుగ్గాదని. కానీలే ఏటింకా మునిగిపోడంకి మిగిలిందీ? ఆఖరిదాని పెళ్లి మిగిలింది. ఆ వున్ని ఎకరా అమ్మేసి..యే అయ్యనో చూసి యిన్ని అక్షింతలు యేసేస్తాను. ముసిలోలిమిద్దరిమీ- నా కన్నోరిచ్చిన మడిసెక్కల్తోటి బతికేస్తాం అనుకున్ను!

మళ్లా యిదేటి? ఎలిపోయినోడు... ఎందుకొచ్చేడు? ఇంకేటి మిగిలింది? సెప్పు అయ్యవోరో సెప్పు!" అని చంద్రమ్మ - విపులంగా యింటి పరిస్థితిని చెప్పి నిలదీసింది అయ్యవారుని!

సూర్యనారాయణ - పట్నంలో బ్రతకలేక, బ్రతుకుదారిలేక తిరిగొచ్చేసేడు.

అంతకుముందు - యిక్కడకంటే ...పట్నంలో మంచి ఉపాధి దొరుకుతుందని వెళ్లాడు. వెళ్లటానికి ముందు.. యిక్కడ యెంతో సతమతమయ్యేడు. కులాసాగా కాలేజీ బ్రతుకు బ్రతికినవాడు మాట

నిలబెట్టుకోడానికి పెళ్ళిజేసుకొని ఊరొచ్చేక పొలంలో కష్టపడ్డాడు. గానీ, ఆ కష్టం ఇంగ్లీషు మాస్టారు తెలుగు మాస్టారి డ్యూటీ చేసేటట్లుగా వుండేది. అటు సరోజిని అసలు- పొలం పనులకి అలవాటు కాలేకపోయింది. ఇంటిలో వంటా, వార్పూ, పశులకు కుడితినీళ్ళు, పాలలూడ్వటం..యేదీ చేయలేకపోయేది. ఏడాది, కేడాదీ యీ నిర్బంధ శ్రమ జేసినా ఋతువుల్తో జూదంలో వ్యవసాయం మడుపులు గిట్టుబాటయ్యేది కాదు. పట్నంలో అత్తవారి మెస్ ప్రక్కనే, కిల్లీ, సిగరెట్ బడ్డీ పెట్టుకుంటే..యిక్కడకంటే ఉత్తమమని భావించి - భూమి అమ్మకం జేయించి..వెళిపోయేడు. అలా వెళ్లాక కొన్నాళ్లు పట్నంలో బాగానే గడిచింది. రోజా పుట్టిన యేడాది దాకా బాగానే వెళ్లాయి రోజులు. ఆ రోజుల్లోనే, గవర్నమెంటులో నౌకరీకి వయఃపరిమితి దాటిపోతోందని ఆందోళన పడుతోంటే ఒక ఆసామీ నౌకరీ యిప్పిస్తానని నమ్మించేడు. అయిదువేలు అర్పణ జేసాడాయనకి- ఎక్కడో అప్పుజేసి. నౌకరీ రాలేదు. వయఃపరిమితి దాటిపోయింది. ఆ ఆసామీ అడ్రస్ కన్పించలేదు. అప్పు యిచ్చిన వాళ్లు - కిల్లీ బడ్డీని సామాన్లతో సహా స్వాధీనం చేసుకున్నారు. నిరాధారంగా నిల్చున్నాడు సూర్యనారాయణ.

అత్తవారి మెస్‌లో...అయిదువారాలకంటే యెక్కువ నిలువలేకపోయేడు.

ఏడాదిన్నర చంటిపాప రోజా.. నాయనమ్మ మీదకి యెగబాకింది. చంద్రమ్మ అందుకుంది. బుగ్గలు చిదిమి ముద్దాడింది. నాయనమ్మ యెత్తుకోగానే- చంటిది...బుల్లి పోసింది!


"...నాయనమ్మ మీద యెంత ప్రేమో చూసేరా?" అని ఆ విధంగా ...ఘర్షణ పూరిత గంభీర వాతావరణాన్ని - తేలిక పరిచేడు అయ్యవారు. ఇంట్లోకి అడుగుపెట్టాడు సూర్యనారాయణ భార్యా, బిడ్డల్తో!

***

"కనీ, పెంచిన తల్లిదండ్రులమీద ఆ మాత్రం అప్మానంలేపోతే యెలాగరా మామా?' 'అని, కాస్త అభిమానమన్నా చూపాలన్నట్లుగా అన్నాడు పోలయ్యమామ!

"....అలాగ తలదించుకుంటే యెలాగ? అనువులో, మినువులో అనాలగదయ్యా..." అన్నాడు అయ్యవారు.

"...పోనాక వచ్చెయ్యెరా! అర్థరాతిరి, అందరూ తొంగొన్నాక, పెద్దబండ్రాయి తీసి. ముసిల్దాని మీదెత్తిరా- బాద తీరిపోద్దినీకు."




అని గసురుకున్నాడు లచ్చయ్యతాత మళ్లీ!

అప్పటిదాకా, లచ్చయ్యతాత అన్నవన్నీ భరించేడు. పోలయ్యమామా సలహాయి చ్చేస్తుండే సహించేడు. గానీ, యీ ఆఖరి మాటకు.. సూర్యనారాయణ గుండె ల్లోంచి దుఃఖం పొంగుకొచ్చి-

".....నేలబుగ్గి నెత్తికి యెత్తుకున్న...... బతుకెల్ల కుంటంది. పిల్లల్తోటి నేను పస్తులుం టన్నాను. సేరడు గింజలింటిల వుంటే - మీ చెప్పొదీసి కొట్టండి. నా తల్లిమీద నాకు మాత్రం మమకారముండదా? చెయ్యి సాగకే...యీ యిబ్బందులు...." అని చెప్పాడు సూర్యనారా యణ.

***

నిజమే. నేల మీద బుగ్గి యెత్తి పోసుకున్నాడు. ఎకరా నేల తాత్తండ్రులాస్తి; తల్లి పసుపు కుంకుమ ఆస్తి మరో ఎకరా నేల మిగిలేయి. వాటి మీద కష్టపడ్డాడు. ఇంటి కర్చులకే నరిపోయేది కాదు...ఫలసాయం. ఇంటి ఖర్చులు... మారిపోయేయి. కరెంట్ వచ్చింది ఊర్లోకి. యింటికి వేసాడు. కాన్వెంటొచ్చింది ఊర్లోకి - పాపని చేర్చాడు. కట్టుకునే వస్త్రాలు, వాడుకునే వస్తువులూ - మార్కెట్లో కొత్తకొత్తవి వస్తే - అవి ....యింటికి అవసరాలే అయ్యేయి. జీవన వ్యయం గతం కంటే - అధికమైంది. పెరిగింది. ఖర్చులు పెరిగిన నిష్పత్తిలో ఫలసాయం పెరగలేదు. చెల్లెలికి వయసు పెరగుతోంది. వరుని ధర పెరుగుతోంది. ఇంట్లో తల్లీ, భార్యల మధ్య వైరుధ్యం పెరగసాగింది. తల్లికి.....కొడుకుమీద అనుమానం కలగ సాగింది. నిత్య ఘర్షణ...యింట్లో రివాజైంది.

"...యిలాగ యింట్లో గొడవల్తోటి బతకలేను. ఎలాగూ పశివిలు లేవు. సాలా ఖాలీగుంది. దానికి గోడలు తడకల్తోటి లేపేసి, యిల్లు జేసిస్తాను. నన్ను అందులోకెలిపొ మంటారో ; అమ్మా నాన్నలే యెలిపోతారో.... కనుక్కోండి." అని ఓ రోజు అయ్యవారితో అన్నాడు సూర్యనారాయణ

అయ్యవారు ఆలోచనలో పడితే -

"...పోషణ గురించి నాది పూచీ. మా అమ్మ భూమి పండించి. అంతా ఆళ్లకే యిచ్చేస్తాను. వేరు కాపురాలుండక తప్పదు మరి..." అని నిర్ధారించేడు సూర్యనారాయణ. అయ్యవారికి ..యింట్లో ఆడవారి మధ్య వైరుధ్యాలు అర్థమయ్యేయి. ప్రత్యామ్నాయం .....మరింకేది?

అదిగో - అప్పట్నించే - ఆ పాకలో చంద్రమ్మ, గుంపస్వామి నాయుడూ, చిన్న కూతురూ...కలిసి కాపురముంటూ వచ్చేరు.

అన్న ప్రకారం - సూర్యనారాయణ తల్లి భూమిలో పంటను అప్పగించేడు కొన్నాళ్ళు. ఇద్దరు బిడ్డల తండ్రయినాడు. వేరుకాపురాలు పెట్టినా రెండిళ్ల పోషణభారాన్నీ మోసాడు. ఇంతలో ఆఖరి చెల్లికి సంబంధం వచ్చింది. ఎకరానేల అమ్మేసి పెళ్లి జరిపించేడు. ఇక మిగిలింది - తల్లి పసుపు కుంకుమల క్రింద వచ్చిన ఎకరానేల! దాని మీదనే - రెండుకుటుంబాలు - అర్థాకలితో బ్రతుకు లీడ్చాలి.

మళ్లీ దేవాలయం భూమి కౌలు తమకొస్తేనో? తనతోపాటూ కౌలుహక్కు కోల్పోయిన రైతుల్ని కూడగట్టి - ప్రయత్నాలు ఆరంభించేడు. అయ్యవారూ ఆ ప్రయత్నా లకు మద్దతిచ్చేడు. భూమి అయితే రాలేదు గానీ - కోవెలకు పోలీసులు వచ్చేవారు - రైతుల్తో రహస్య సమావేశాలౌతున్నాయని అనుమానించే వారు. సూర్యనారాయణ ...దేవాలయ భూమి కౌలు ఆశకు నీళ్లోదులు కున్నాడు. కూలీ నాలీ జేసి - కుటుంబాన్ని యీడ్చు కొస్తున్నాడు. చెల్లి పెళ్లయిన - యేడాదికి తండ్రి చనిపోయేడు. తండ్రి చనిపోయి యేడాదైంది.

***

"నిజమేన్రా. కాదన్లేం నీకూ కష్టమే. పిల్లల్తోటున్నావు. పోనీ, ఒక పన్చెయ్యిరా. మీ ముసిల్దాని భూమి ముసిల్దానికొదిలే. అదే,

యెవురికో తనఖాబెట్టీసో, అమ్మేసో...తిని బతుకుతాది....అనిచెప్పాడు పోలయ్య మామ.

పోలయ్య మామ పొలం ప్రక్కనే - యీ పొలం వుంది. ఈ పొలం కొని, కలిపేసుకుందామని యెప్పటినించో యెదురు చూస్తున్నాడు పోలయ్యమామ. ఆ విషయం గ్రహించిన సూర్యనారాయణ -

"...అలగని, మా అమ్మ అన్నాదా?" అనడిగేడు.

అయ్యవారు గాభరాపడిపోయేడు. చంద్రమ్మ అలాగనలేదు..గానీ పోషణకు మార్గం చూడమంది.

"...యీ ముక్క చెప్పడంకే పిలిచేరా అయ్యవోరూ?" అని అయ్యవార్ని అడిగేడు సూర్యనారాయణ.

అయ్యవారు ....సూర్యనారాయణ వైపు చూడలేక,తలదించుకున్నాడు.సూర్యనారయణే, గుండెల్లో ఆవేదనని స్థిరంగా వెళ్లగక్కేడు -

"...అయ్యా, అయ్యవారయ్యా ! లచ్చయ్య తాతా! పోలయ్య మామా! మీ దాకా...యీ తగువొచ్చినపుడే అనుకున్నాను ...తల్లి పోషణ చూడని కర్కోటకపు కొడుక్కింద జమయిపోనానని!

మా అమ్మ గుణం నాకు తెల్సు. నా సంగతీ మా అమ్మకి తెల్సు అయితే పేగులు మధ్య యీ కలహాల్ని తెచ్చిన లేమి యెందు కొచ్చిందో? ఎలా గొచ్చిందో? వొచ్చింది మా బతుకులికి!

ఇపుడు, ఆ ఉన్న ఎకరానేలా పోతే - యీ గింజలకీ ఆధరువు పోయి - నా పిల్లలు పస్తులుంటారు. అది, మా అమ్మకి యిష్టమే అయితే అలాగే దాని భూమి దానినే తీసుకోమనండి. అలాగే చెయ్యండి...." అని చెప్పి; ధారలుగా కారే కన్నీటిని తుడుచుకుంటూ అక్కడినుంచి వెళ్లిపోయేడు సూర్యనారాయణ!

అయ్యవారు....ఓ క్షణం దాకా తేరుకోలేకపోయేరు. లచ్చయ్యతాత మాత్రం, సూర్యనారాయణ స్థితికి కరుణతో కరిగి పోయేడు. సానుభూతిగా -

"....అదీ అసలు చిక్కు! పాపం ...గుంటడు ! కలిమిల పుట్టినాడు. కలిమిలే పెరిగేడు. లేమి కాలం వొచ్చేసరికి... బరువెత్తుకోవాల్సొచ్చిందాడికి. పాపం...ఆడికీ కష్టమే!" అన్నాడు.

"...ఆళ్లఅమ్మ యేటంటాదో?" పోలయ్య మామ - ఎండుగుల కోసం చూసే కాకిలా.... పలికి, కదిలేడు అక్కడ్నించి.

అయ్యవారికి - చంద్రమ్మ సమస్యకు ప్రత్యామ్నాయం దొరకలేదు. ఏమీ ఆలోచించలేక - మెదడంతా మొద్దుబారి పోయింది. లేచి, యింటివైపు నడిచేడు. లచ్చయ్య తాత - నెమ్మదిగా నాగావళి నదివైపు నడిచేడు.

అయ్యగారు యింటి కొచ్చేసరికి, కొడుకు మురళీ రేడియో పెట్టుకుని వింటూ, ఆనందంగా -

"....అన్ని సీట్లూ అపొజిషనోల్లే గెల్చారు. గవర్నమెంటు మారిపోద్ది. మరి, ఫర్లేదు. బియ్యం యిక కేజీ రెండ్రూపాయలకి దొరుకుతాయి....." చెప్పాడు తండ్రితో!

ఆ మాట విన్న అయ్యవారికి - చిక్కుముడి విడినట్లన్పించింది.భూమికి ప్రత్యామ్నాయంగా ...బియ్యం చవగ్గా దొరుకుతాయి (!?) చిక్కుముడి విడిపోయినట్లే.... ఊపిరి దీసేడు అయ్యవారు.

మనుషులూ, సంస్థలూ, ప్రభుత్వాలూ - ప్రత్యామ్నాయాల్ని వెదుకుతూ ....కాల చక్రాన్ని కదిలిస్తుంటారు. ఆలోచనల్లో వున్నాడు అయ్యవారు.

"....అయ్యవోరుబావూ...బేగిరమీ్మ! చంద్రప్ప...పిలిస్తే పలక్కుంటంది." అని యెవరో ఆంధోళనగా కేకలేసారు.

గాభరాగా అయ్యవారూ, ఇంట్లోంచి అయ్యవారమ్మా పరుగెత్తుకు వెళ్లారు.

చంద్రమ్మ కనుగుడ్లు తేలేస్సి, లోకమ్మీద అనంత నిరసనను ప్రదర్శిస్తూ నిశ్చలంగా ....నులక మంచమ్మీద అనంత నిద్ర తీస్తోంది!

ప్రత్యామ్నాయం.....అవసరం లేదని చెప్పింది చంద్రమ్మ - అనుకున్నారు అయ్యవారు.

అయ్యవారమ్మ -

"చెంద్రప్పా......."అని పిలుస్తూనే వుంది.


ESTD : 1978

Phones : Resi : 32357
Offi : 2206

## విజ్ఞప్తి

## ఉయ్యూరు పబ్లిక్ స్కూల్

ఉయ్యూరు

కృష్ణాజిల్లా (A.P)

**(L.P.P to X Standard)**

**హాస్టల్**

విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియ చేయునదేమనగా అందరికి అందుబాటులో ఉండునట్లుగా, ఉత్తమమైన ఫలితాలు సాధించుచున్న ఉయ్యూరు పబ్లిక్ స్కూల్ నందు 1995 - 96 విద్యా సంవత్సరమునకు హాస్టల్ ప్రారంభించుచున్నాము.

విద్యార్థుల విద్య గురించి మరియు క్రమశిక్షణకు ఆహారవిహారాదులకు ఉత్తమమైన వ్యక్తిగత శ్రద్ధకు మా హాస్టల్ ద్వారా అవకాశం కల్పించనున్నాము. June 1st, 1995 నుండి అడ్మిషన్లు ప్రారంభమగును. వలసినవారు ప్రోస్పెక్టస్ మరియు అప్లికేషన్లు ఉచితముగా మా ఆఫీసునందుగాని post ద్వారాగాని పొందగలరు.

ఇట్లు
B.V. రంగారెడ్డి
డైరెక్టర్.

ఉయ్యూరు పబ్లిక్ స్కూల్
యాజమాన్యము